



పిల్లల పండగకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 4వ కర్నూలు బాలోత్సవం
- మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో నిర్వహణ
- హాజరుకానున్న 2 వేల మందికిపైగా విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు బాలోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురు, శుక్రవారాల్లో జరగనున్న ఈ వేడుకలకు కర్నూలు నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాల వేదిక కానుంది. దాదాపు 2 వేల మంది విద్యార్థులు ఈ వేడుకల్లో భాగస్వామ్యం కానున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే విధంగా ప్రతేడాది కర్నూలు బాలోత్సవ కమిటీ రెండు రోజులపాటు ఉత్సాహ వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తోంది. వరుసగా నాలుగో సారి కర్నూలు బాలోత్సవ సంబరాలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో కర్నూలు డివిజన్ పరిధిలోని 250 పాఠశాలలు పాల్గొంటున్నాయి. దాదాపు 2 వేల మంది విద్యార్థులు రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగస్వామ్యం అవుతున్నారు. మొదటిరోజు వేడుకలను కలెక్టర్ డాక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ జాతీయ పతాక ఆవిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు. బాలోత్సవాల నిర్వహణకు మూడు వేదికలు ఏర్పాటు చేశారు. ప్రధాన వేదిక మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత కల్యాణమ్మ పేరుతో, రెండో వేదిక గాదె సుబ్బారెడ్డి పేరుతో ఏర్పాటు చేశారు. విద్యార్థులకు డ్యాన్స్, సింగింగ్ పోటీలతోపాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నారు. మొత్తం 35 రకాల ఈవెంట్లను నిర్వహించనున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది మరింత ఉత్సాహ పూరిత వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి జెఎన్.శేషయ్య, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్ వెల్లడించారు. బాలోత్సవ వేడుకల్లో విద్యార్థులు భాగస్వామ్యమయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని వారు కోరారు.

కార్యక్రమాలు ఇలా : కర్నూలు బాలోత్సవంలో భాగంగా తొలి రోజు గురువారం ఉదయం ప్రారంభ సభ నిర్వహించనున్నారు. అనంతరం చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్య పోటీలు, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ వ్యాసరచన, వక్తృతం పోటీలు నిర్వహించనున్నారు. శుక్రవారం విచిత్ర వేషదారణ, ఏకపాత్రాభినయం, జానపద నృత్యం బృంద పోటీలు, చిరు నాటికలు, దేశభక్తి గీతాలాపన, కోలాటం పోటీలు నిర్వహించారు. అనంతరం ముగింపు సభ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

• కార్మిక సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కార్మికులను కట్టు బానిసలు చేసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎమ్‌డి.అంజి బాబు, మునెప్ప డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక జిల్లా పరిషత్తు నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సి హెచ్.సాయిబాబా, ఎఐటియుసి నగర నాయకులు రామాంజనేయులు అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఎండి అంజిబాబు, మునెప్ప మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను అమలు చేస్తే కార్మికులు కట్టు బానిసలుగా మారిపోతారని తెలిపారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు


కొత్తగా వచ్చిన లేబర్ కోడ్‌ల వల్ల తమ హక్కులను కోల్పోతారని అన్నారు. ఆక్యుపేషన్ హెల్త్ సేఫ్టీ అండ్ వర్కింగ్ కండిషన్స్ ప్రకారం ఉద్యోగి, కార్మికుడు అనే స్థానాలనే మార్చేసిందని తెలిపారు. కార్మికులను ఉద్యోగులను చట్టాలకు దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం పదిమంది కార్మికులు పనిచేసే సంస్థలు కోడ్ పరిధిలోకి రావని అన్నారు. పనిచేసే సంస్థలు 20 మంది కార్మికులు పనిచేసే సంస్థలు కోడు పరిధిలోకి రావన్నారు. 500 మంది పని చేసే సంస్థలు 250 మంది లోపు కార్మికులు పనిచేసే సంస్థలు సంక్షేమ అధికారి అవసరంలేదని, కోడ్లు చెబుతున్నాయని, వంద మంది లోపు ఉంటే క్యాంటీన్ అవసరం లేదని, 50 మంది లోపు మహిళలు ఉండే సంస్థలలో క్రచ్‌లు ఏర్పాటు చేయరని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ లాంటి సౌకర్యాలు పారిశ్రామిక వివాదాల చట్టం కింద పనిచేస్తే రద్దయ్యే ప్రమాదం ఉందని అన్నారు. పర్మనెంట్ ఉద్యోగి అనే పరిస్థితి లేకుండా ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్, హైర్ అండ్ ఫైర్ తాత్కాలిక ఉద్యోగులుగా నియమిస్తారన్నారు. వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులను తెచ్చిందని, దీనివల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. రైతులకు బడ్జెట్‌ను పెంచి బడ్జెట్ను సవరించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు జగన్నాథం ఎఐటియుసి నాయకులు నాగన్న, రైతు సంఘం నాయకులు కృష్ణ తదితరులు మాట్లాడారు. సిఐటియు నగర నాయకులు విజయ్, నరసింహులు, ప్రభాకర్, సుధాకరప్ప, యేసు, అబ్దుల్లా, కుమార్, ఎఐటియుసి నగర నాయకులు కృష్ణారెడ్డి, ఈశ్వర్, రైతు సంఘం నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టాక పెరిగిన విద్యుత్ బిల్లులు రద్దు చేయాలి

- విద్యుత్ ఎస్ఇకి పిపిఎస్ఎస్ బృందం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నెలకు రూ.3 నుంచి 4 వేలు వచ్చే విద్యుత్ బిల్లు స్మార్ట్ మీటర్లు బిగించాక రెండు నెలలు 60 వేలకు పైగా విద్యుత్ విల్లు వచ్చిందన్నారు. ఇదేమి న్యాయం అంటూ నెల రోజులుగా విద్యుత్ అధికారుల చుట్టూ తిరిగినా ఇది అంతే మేమేం చేయలేం అని సంబంధిత విద్యుత్ శాఖా ఇంజనీర్లు సమాధానం చెప్పారన్నారు. రూ.3 వేల నుండి రూ30 వేలకు కరెంటు బిల్లు పెరిగితే చేతివృత్తులు చేసుకునే వారు ఇల్లు అమ్ముకొని వలసలు పోవాలా ? అనీ పట్టణపౌరసంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం. నాగరాజు,న్యాయవాది ఆర్ చంద్రశేఖర్ ప్రశ్నించారు. అజుముద్దీన్‌నగర్‌కు చెందిన బాధితుడు ఎండి. ఉస్మాన్‌బాషతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం విద్యుత్ శాఖ ఎస్ఇకి వినతిపత్రం ద్వారా భారీగా వచ్చిన విద్యుత్ బిల్లు గురించి వివరించారు. పిపిఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ అజుముద్దీన్‌నగర్‌లో 60504 నెంబర్ గల మీటర్‌పై గతంలో రూ3నుండి 4వేలు విద్యుత్ బిల్లు వచ్చేది. నవంబర్లో స్మార్ట్ మీటర్ బిగించాక రూ.7223లు, డిసెంబర్ 2న రూ.30,758 లు, ఫిబ్రవరి 3న రూ. 29,524 ల విద్యుత్ బిల్లులు వస్తే ఎలా చెల్లించాలన్నారు. ఇల్లు అమ్మీ.. విద్యుత్ బిల్లు చెల్లించి వలస పోవాలా ? అని ఎస్ ఈ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించడం బాధాకరమన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, వాటి ద్వారా బిల్లులు చెల్లింపు విధానాన్ని ఆపివేయాలని విద్యుత్ నియంత్రణ మండలి గౌరవ చైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. మా అభ్యంతరాలు లెక్కచేయకుండా విద్యుత్ శాఖకు చెందిన సిబ్బంది స్మార్ట్ మీటర్లు బిగించడం ఇదేం న్యాయం అని నిలదీశారు. విద్యుత్ మీటర్లను వాటి ద్వారా చెల్లింపులు రద్దు చేయాలని ప్రతినిధి బృందం కోరింది. సూపరెండెంట్ ఇంజనీరు ఉమాపతి మాట్లాడుతూ పాత మీటర్లకు బిగించిన కెపాసిటర్లను స్మార్ట్ మీటర్లకు ఉపయోగించరాదన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, అది అధిక బిల్లుల రద్దు చేయడం నా పరిధిలో లేదని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తెస్తానన్నారు. ఐదు దఫాలుగా విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు అవకాశం ఇస్తానని హామీ ఇచ్చారు. రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మొయిద్దీన్, మోహన్‌రావు, మహమ్మద్ యూనిస్,శశి కుమార్ రెడ్డి, నాసిర్ ఖాన్ తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న పుల్లారెడ్డి, నాయకులు

యువత నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

యువత నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను పొందాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. బుధవారం బి.తాండ్రపాడులో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. యువతకు విద్యతో పాటు వివిధ అంశాల్లో నైపుణ్యాలు ఎంతో అవసరమని అన్నారు. పట్టణ ప్రాంతాల్లోని యువతీ, యువకులతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో యువతకు అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. గ్రామీణ యువతలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి కెనరా బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా వివిధ అంశాల్లో నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. చాలా మంచి సౌకర్యాలతో నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సంస్థ నిర్వహిస్తున్న కోర్సుల్లో చేరి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుని ఉపాధి పొందాలని కలెక్టర్ సూచించారు. అధికారి మాట్లాడుతూ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా చాలా సంవత్సరాల నుండి యువతీ, యువకులకు నైపుణ్య పరంగా శిక్షణను ఇచ్చి, వారికి ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని, ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి,జనరల్ మేనేజర్ ఐ.పాండురంగ మితన్ తాయ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్, శిక్షణ సంస్థ డైరెక్టర్ పుష్పకుమార్, ఎల్‌డిఎం రామచంద్రరావు, డిఆర్‌డిఎ పిడి నాగశివలీల, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు అందుబాటులో ఉండాలి

ఏ ఒక్క విద్యార్థి నష్టపోకుండా, పాఠశాలలు అందుబాటులో ఉండేలా ప్రతిపాదనలు ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాష విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ విద్యాశాఖ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండల విద్యా శాఖాధికారులతో మాట్లాడుతూ... పిల్లలకు ఇబ్బందులు కలగకుండా రీస్ట్రక్చరింగ్ జరగాలని ఆదేశించారు. పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతం అయ్యేలా ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాలకు సంబంధించిన క్లస్టర్ల వారీగా పాఠశాలలు, విద్యార్థుల వివరాలను మండల విద్యా శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలకు అప్రోచ్ రోడ్లు ఏర్పాటుకు ఎస్టిమేట్లు తయారు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని డిఇఒను ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా విద్యా శాఖాధికారి శామ్యూల్ పాల్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డిఆర్డిఎ పిడి నాగశివలీల, డిపిఒ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాలి

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రోజు లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎపిడి, ఎంపిడిఒ, ఎపిఒలను ఆదేశించారు. బుధవారం ఎపిడిలు, ఎంపిడిఒలు, ఎపిఒలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన వారందరికీ పనులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం 63 శాతం పనులు కల్పించామని, ఇది చాలదని, నిర్దేశించిన లక్ష్యాల కంటే ఎక్కువగా పనులు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని, సగటు వేతనం రూ.290కి పైగా వచ్చేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామ సభలలో నిర్వహించి, కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు.. దేవనకొండ మండలంలో వలసలు ఎక్కువగా జరుగుతున్నప్పటికీ కూడా ఏ మాత్రం గ్రామసభలు నిర్వహించినట్లు కన్పించడం లేదని కలెక్టర్ ఎంపిడిఒ పని తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మినీ గోకులాల నిర్మాణాలకు సంబంధించి ఆదోని, కర్నూలులో వెనకబడి ఉన్నారని, ఫిబ్రవరి చివరి నాటికి మినీ గోకులంల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో డ్వామా పిడి వెంకటరమణయ్య, అన్ని మండలాల ఎంపిడిఒలు, ఎపిడిలు, ఎపిఒలు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు


తడకనపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

తడకనపల్లి చెరువుకు నీటి విడుదల

సిసిరోడ్డు, గోకులం షెడ్డు ప్రారంభం - గౌరు దంపతులకు ప్రజల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం తడకనపల్లి చెరువుకు నీటిని నింపడం వల్ల తాగు, సాగునీరు ప్రజలకు పుష్కలంగా లభిస్తాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి అన్నారు. తడకనపల్లె చెరువుకు నీళ్ల నింపేందుకు ఏర్పాటుచేసిన రెండు విద్యుత్ మోటార్ పంప్ సెట్లను ప్రారంభించి చెరువుకు నీటిని విడుదల చేశారు. తడకన పల్లె గ్రామంలో రూ. 21.50 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును, గోకులం షెడ్డును ఆమె ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తడకనపల్లి చెరువుకు నీటిని నింపడం వల్ల ప్రజలకు తాగునీరు పొలాలకు సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. గత ఐదేళ్లలో మోటార్లు లేకపోవడం వల్ల చెరువులో నీళ్లు లేక రైతులు పంటలు పండించుకోలేకపోయారని గుర్తు చేశారు. శ్రీశైలం డ్యాములో నీళ్లు పుష్కలంగా ఉంటే గ్రామానికి తాగు, సాగు నీరు ఉన్నట్లేనని అన్నారు. విద్యుత్ మోటార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయడంతో గ్రామం సస్య శ్యామలం అవుతుందని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి, టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచి సహరాబి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, ఎంపిడిఒ నాగ శేషాచల రెడ్డి, మైనర్ ఇరిగేషన్ డిఇ నాగరాజు, పంచాయతీ రాజ్ డిఇ నాగిరెడ్డి, ఎఇ రవి మోహన్ రెడ్డి, మండల నాయకులు పుసలూర్ ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు



అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి-సి బెళగల్

సిబెలగల్ మండలంలో సాగుకు, తాగుకు, ప్రజల ఇళ్లకు, పరిశ్రమలకు, వీధి దీపాలకు అవసరమైన విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ సూపరిన్‌టెన్‌డెంట్ ఇంజనీర్ ఉమాపతి తెలిపారు. మండల విద్యుత్ ఎడి జెస్సన్, ఎఇ సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారను. బుధవారం సి బెళగల్, బురాన్ దొడ్డి విద్యుత్ సబ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ప్రస్తుతం మండలంలో త్రీఫెస్ సరఫరా ఇచ్చేందుకు లైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. పక్కడ్బందీగా చేపట్టాలని అన్నారు. మండలంలో విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని, బకాయి బిల్లులపై దృష్టి సారించి ప్రభుత్వ ఆదాయనికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి

డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శాంతి కుమారి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్



ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శాంతికుమారి అన్నారు. బుధవారం రవాణాశాఖ 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు అవగాహన కార్యక్రమం ఆసుపత్రిలో ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో వైద్య సిబ్బందితో నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆసుపత్రికి ఎన్నో ఆక్సిడెంట్ కేసులు వస్తున్నాయన్నారు. ఆ కేసులకు మేము మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. రోడ్డుపై డ్రైవింగ్ చేసేటప్పుడు రోడ్ సేఫ్టీకి సంబంధించిన సీట్ బెల్టు, హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని అన్నారు. గతంలో వాహన స్పీడ్ 60-70లో వెళ్లే వెహికల్స్ ఇప్పుడు వచ్చే అధునాతమైన వెహికల్‌లకు సేఫ్టీ ఫీచర్స్ ఉన్నా కూడా ఆక్సిడెంట్లు జరుగుతున్నాయని అన్నారు. స్పీడ్ లిమిట్ తగ్గించుకోవాలన్నారు. ఎవరికైనా యాక్సిడెంట్ జరిగిన వెంటనే ఆసుపత్రికి తరలించాలని, అలా చేయడం వల్ల ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడిన వాళ్ళు అవుతారని అన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శాంతి కుమారి మాట్లాడుతూ డ్రైవింగ్‌లో నైపుణ్యం సరిగా లేకపోవడం, రోడ్డు భద్రతా జాగ్రత్తలు పాటించకపోవడం, అవగాహన లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు చాలా జరుగుతున్నాయి అన్నారు. ఆసుపత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, కర్నూల్ డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ, కర్నూలు ఆర్‌టిఒ భరత్ చౌహాన్, కర్నూలు ట్రాఫిక్ ఇంచార్జ్ డిఎస్‌పి మన్సురుద్దీన్, డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ డిస్టిక్ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎపిఇఆర్‌సి కార్యాలయం తరలింపు తగదు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

హైకోర్టు బెంచ్‌కు భవనం పేరుతో ఎపిఇఆర్‌సి కేంద్ర కార్యాలయాన్ని కర్నూలు నుండి అమరావతికి తరలించే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. వెనుకబడిన కర్నూలు జిల్లాలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యాలయాలు ఒక్కొక్కదానిని టిడిపి కూటమి ప్రభుత్వం అమరావతికి తరలించే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలను విరామించుకోవాలని కోరారు. భవనాల పేరుతో రాష్ట్ర స్థాయి కార్యాలయాల తరలింపు ఏమాత్రం సమంజసమైంది కాదని జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందని జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్‌పిని కలిసిన నగరపాలక కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



జిల్లా నూతన ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పికి కమిషనర్ పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల కడుపుకొడితే సహించం

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కేంద్ర ప్రభుత్వం నూతన లేబర్ కోడ్లతో, కార్మికుల కడుపు కొట్టడానికి ప్రయత్నిస్తే సహించబోమని, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బి కృష్ణ, మండల కార్యదర్శి బి రాజు,, ఎఐటియుసి మండల నాయకులు మద్దూరు చిన్నరాముడు, ఆటో మధు, సిపిఎం మండల నాయకులు గపూర్‌మియా, సిఐటియు మండల కార్యదర్శి బజ్జీల వీరన్నలు తెలిపారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోడుమూరు పట్టణంలో ఎఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.



కోడుమూరులో కార్మిక సంఘాల నిరసన

గూడూరు: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దుచేసి ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలను కొనసాగించాలన్నారు. గూడూరులో పాత బస్టాండ్ సెంటర్లో సిఐటియు ఆధ్వర్యంలో మండల నాయకులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ధర్నా చేశారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి జై మోహన్ మాట్లాడారు.

వెల్దుర్తి : కార్మికులకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి రాజు, ఎఐటియుసి మండల కార్యదర్శి మాధవ స్వామి డిమాండ్ చేశారు. వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో కార్మిక సంఘాలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాహశీల్దార్ చంద్రశేఖర్ వర్మకు వినతిపత్రం అందజేశారు.

మద్దికేర : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్ ను వెంటనే రద్దు చేయాలని మద్దికేర మండల సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించేశారు. తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్ కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు అధ్యక్షతన ధర్నా చేశారు. సిఐటియు మండల కార్యదర్శి బిల్లెకంటి రాముడు మాట్లాడారు.



గూడూరు నిరసనలో మాట్లాడుతున్న మోహన్



మద్దికేర తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా

ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి- వెల్దుర్తి : ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేకనిఘా ఉంచాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణంలో ఉన్న ప్రభుత్వం కేటాయించిన మోటార్ సైకిల్‌ను మూలన పెట్టడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాహనాన్ని బాగు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. పలు కేసులలో పట్టుబడిన వాహనాలను వాటి వివరాలను అడిగి తెలుసు కున్నారు. మండల కేంద్రంలోని ఫ్యాక్షన్ గ్రామమైన చెరుకులపాడు లోని పికెట్‌ను పరిశీలించారు. శాంతిభద్రతల విషయంలో సిబ్బంది కఠినంగా ఉండాలని అన్నారు. గ్రామాల పరిస్థితులను సిఐ మధుసూదన్‌రావు, ఎస్ఐ అశోక్‌ను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.


ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్రంలో కూడా వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిసిసి అధ్యక్షుడు పి మురళీకృష్ణ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలుకు తెలంగాణ ప్రభుత్వం, చట్టసభలు పచ్చ జెండా ఊపాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుదృష్టి సారించాలని ఆయన కోరారు

స్వయం ఉపాధి రుణాలు మంజూరు

సిఎంకు టిడిపి నేత వాహీద్ హుస్సేన్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం



ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాల మంజూరు అభినందనీయమనిటిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వాహీద్ హుస్సేన్ కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును అమరావతిలో ఆయన కలిశారు. ఎస్‌సి, బిసి, మైనారిటీల జీవనోపాధులు మెరుగుపడడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, బిసి కార్పొరేషన్ కింద అర్హత ఉన్న ఇబిసి, కమ్మ, రెడ్డి, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాల వారికి 50 శాతం సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేస్తున్నారన్నారు. జిల్లాలోని అర్హత కలిగిన లబ్ధిదారులు ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆదోని మున్సిపల్ మైదానం నుంచి ప్రధాన రోడ్ల గుండా ప్రదర్శనగా వచ్చి భీమాస్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత ఆరోగ్యం నేచర్ ఆఫ్ వర్క్ కోడ్ తీసుకొచ్చిందన్నారు. వీటిని కార్మిక సంఘాలు వ్యతిరేకించినా కార్మిక హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్మికుల పని దోపిడీని మరింత తీవ్రం చేసేందుకు ఈ లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని, ఈ ప్రమాదాన్ని కార్మికులు నిరసనల ద్వారా తెలియజేస్తున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, ఎఐటియుసి మండల అధ్యక్ష, కార్యదర్శులు భీమేష్, వెంకన్న, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, మండల కార్యదర్శి వీరారెడ్డి, ఎఐటియుసి నాయకులు షేక్షావలి, రాజు, సిఐటియు నాయకులు లక్ష్మన్న, అజం ఖాన్, చాంద్ బాష, నరసప్ప ఉన్నారు. అలాగే సిఐటియు, రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు రామాంజనేయులు మాట్లాడారు. సిఐటియు సీనియర్ నాయకులు మహానంది రెడ్డి, సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాల్, మండల కార్యదర్శి వీరారెడ్డి, సిఐటియు పట్టణ నాయకులు లక్ష్మణ్, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతుసంఘం నాయకులు బాష, హనుమంత రెడ్డి, సిఐటియు నాయకులు కృష్ణమూర్తి ఉన్నారు. **ఆస్పరి**లోని అంబేద్కర్ సర్కిల్‌లో లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని నిరసన చేపట్టారు. కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, సహాయ కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గానికి ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్‌ల ముఖ్య ఉద్దేశమని, కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాలు అమలు చేస్తే తిరుగుబాట్లు, సమ్మెలు చేపడతామని హెచ్చరించారు. వ్యకాస మండల అధ్యక్షులు నరసింహులు, రైతుసంఘం సీనియర్ నాయకులు మాణిక్యప్ప, రంగప్ప, రంగన్న, శ్రీకాంత్, రాము, రామకృష్ణ, మహానంది, సీనప్ప పాల్గొన్నారు. అలాగే ఎఐటియుసి మండల కార్యదర్శి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద ధర్నా చేపట్టారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.తిమ్మయ్య మాట్లాడారు. అనంతరం బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఎఐటియుసి మండల అధ్యక్షులు చంద్రశేఖర్, సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, ఎఐటియుసి నాయకులు రామయ్య, మల్లికార్జున, కృష్ణ, తాయన్న, వీరశేఖర్, రంగస్వామి, పాండు పాల్గొన్నారు. **దేవనకొండ**లోని అంబేద్కర్ సర్కిల్‌లో సిఐటియు, ఎఐటియుసి, వ్యకాస ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, ఎఐటియుసి జిల్లా నాయకులు ఎం.నరసరావు మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష, ఎఐటియుసి, సిఐటియు నాయకులు బడే సాహెబ్, రాఘవేంద్ర, లక్ష్మణస్వామి, మాబాష, కృష్ణ, రామాంజి పాల్గొన్నారు. **నందవరం** బస్టాండ్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సిఐటియు ఎమ్మిగనూరు తాలూకా కార్యదర్శి రాముడు, సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాల నాయకులు ఉరుకుందు మాట్లాడారు. లేబర్ కోడ్‌ల ప్రమాదాన్ని కార్మికులు తెలుసుకోవాలని, కార్మికుల హక్కుల హరించే లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైతే కార్మిక వర్గం నిరవధిక సమ్మెలకు సిద్ధం కావాలని కోరారు. అంగన్వాడీ వర్కర్స్ పద్మ, భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, రామలింగమ్మ, వెంకటేశ్వరమ్మ, గ్రామ రెవెన్యూ సహాయకులు కోదండ, చిన్న ఏసన్న, తిమోతి, శివ, పంచాయతీ వర్కర్స్ జయన్న, ఆనంద్, వెంకటస్వామి, బజారి పాల్గొన్నారు. **ఆలూరు**లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, ఎఐటియుసి జిల్లా నాయకులు భూపేష్, ఐఎన్‌టియుసి నాయకులు పూల రామాంజినేయులు, సిఐటియు నాయకులు ఈరన్న, శేఖర్, మైనా, గోవర్ధన్, విఠల్, ఎఐటియుసి నాయకులు రామాంజినేయులు, రంగన్న, చాపల గోపాల్ పాల్గొన్నారు. **కోసిగి**లోని వైఎస్‌ఆర్ సర్కిల్‌లో సిఐటియు, రైతుసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు హెప్సిబా రాణి, లూసమ్మ, వరలక్ష్మి, కెవిపిఎస్ నాయకులు హనుమంతు, ఆటో యూనియన్ నాయకులు చిన్నన్న, వ్యకాస నాయకులు చిన్నారెడ్డి పాల్గొన్నారు. **హొళగుంద**లో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ మండల కార్యదర్శులు వెంకటేష్, మారెప్ప, అమానుల్లా మాట్లాడారు. సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు, సమీవుల్లా, బాష, పరశురామ్, హమాలీ సలీమ్, కురువ ఈరన్న పాల్గొన్నారు. **హాలహర్వి** బస్టాండ్ దగ్గర సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ... పెట్టుబడిదారుల అనుకూలమైన చట్టాలు తెచ్చి కార్మికులకు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని డిమాండ్ చేశారు. **ఎమ్మిగనూరు** తహశీల్దార్ కార్యాలయం నుంచి సోమప్ప వరకు వందలాది కార్మికులు ప్రదర్శన నిర్వహించి, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు గోవిందు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎఐటియుసి తాలూకా ప్రధాన కార్యదర్శి తిమ్మగురుడు, సిఐటియు పట్టణ కార్యదర్శి రాముడు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ప్రసాద్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సిపిఎంఎల్ కార్యదర్శి రాజు హాజరయ్యారు. కార్మిక, రైతు సంఘం నాయకులు కెసి.జబ్బార్, బజారి, దాదావలీ, విజేంద్ర, నరసయ్య, సురేష్, అబ్దుల్లా, మహేంద్ర, అగస్టీన్, సమీవుల్లా, ఖాజా, మల్లికార్జున గౌడ్, నరసింహ, ఇస్మాయిల్, అజారుద్దీన్, వీరేంద్ర పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న రాధాకృష్ణ


ఆదోనిలో


ఆస్పరిలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న నారాయణ


దేవనకొండలో



ఆలూరులో మాట్లాడుతున్న నారాయణ స్వామి



నందవరంలో నిరసన చేపడుతున్న నాయకులు



ఎమ్మిగనూరులో నిరసన చేపడుతున్న నాయకులు

అదనపు ఆహారం అవసరం

- సూపర్‌వైజర్ కాత్యాయిని

ప్రజాశక్తి - కోసిగి

పుట్టిన పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలని సూపర్‌వైజర్ కాత్యాయిని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదివే చిన్న పిల్లల శారీరక ఎదుగుదలపై బుధవారం స్థానిక సెక్టార్-2 కింద ఉన్న అంగన్వాడీ కేంద్రాలు 8, 10, 13, 14, 15లలో సిడిపిఒ నాగమణి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ కాత్యాయినితో పాటు ఎంఎల్‌హెచ్‌పి యువరాజు ఈసీసీఈ డే సందర్భంగా సమావేశం నిర్వహించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి నెల 5న పిల్లల ఎత్తు, బరువుపై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గుజ్జు రూపంలో బాలామృతం వంటి పౌష్టికాహారం రోజుకు వంద గ్రాముల వరకు ఇవ్వడం వల్ల పిల్లలు శారీరకంగా ఎదుగుతున్నారు. అంగన్వాడీ టీచర్లు లూసమ్మ, వరలక్ష్మి, దేవి, జ్యోతి, భీమ లింగమ్మ పాల్గొన్నారు.


తల్లులతో మాట్లాడుతున్న కాత్యాయిని

టిడిపి నాయకులకు ఎమ్మెల్యే బీవీ పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

టిడిపి నాయకులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి పరామర్శించారు. నందవరం మాజీ ఎంపిటిసి తిమ్మరాజు తల్లి ఎలుకూరి నరసమ్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని నరసమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. అలాగే హాలహర్వి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు జి.దుబ్బన్నకు ఇటీవల ఆదోని పట్టణంలోని మధు ఆసుపత్రిలో కాలు శస్త్ర చికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హాలహర్వి గ్రామానికి చేరుకొని దుబ్బన్నను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. టిడిపి తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. టిడిపి మండల నాయకులు రైల్వేకిల నారాయణరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాదిర, ధర్మాపురం గోపాల్, టిడిపి గ్రామ అధ్యక్షులు బోయ నాగరాజు, జగన్నాథ్ రెడ్డి, ప్రభుదాసు, ధర్మాపురం బోడిస్వామి, మణికుమార్, బోయ వెంకటరాముడు, ఆనంద్, కిష్టప్ప, ఏసేపు, ఆంధ్రయ్య భాస్కర్, బోయ బుడ్డ రంగన్న, కార్పెంటర్ ఖాజా పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీవీ

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యేకు తెలుగు యువత వినతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వెలుగు శాఖలో పొదుపు రుణాల్లో అవకతవకలకు పాల్పడిన బుక్ కీపర్‌లతో పాటు వారికి సహకరించిన వెలుగు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత మండల నాయకులు రంగస్వామి నాయుడు, సందీప్ నాయుడు, జయపాల్, నాగరాజు కోరారు. బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని కొందరు బుక్ కీపర్లు వెలుగు ఎపిఎం, సిసిల సహకారంతో అవసరం లేని పొదుపు సభ్యుల పేర్లతో శ్రీనిధి రుణాలను తీసుకుని బయట రూ.5, రూ.10 వడ్డీలకు ఇచ్చి నెలనెల వారే కంతులను చెల్లిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభాకర్ నాయుడు, వినోద్ కుమార్ గౌడ్, నరసింహుడు, పెద్దయ్య, మునిస్వామి, ప్రభుదాసు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న తెలుగు యువత నాయకులు

'ర్యాష్ డ్రైవింగ్ పట్ల నిఘా ఉంచండి'

ప్రజాశక్తి - ఆదోని

జన సంచారం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు బైక్‌పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని, అలాంటి వారి పట్ల నిఘా ఉంచి నివారణ చర్యలు చేపట్టాలని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సురేష్ కుమార్ కోరారు. బుధవారం ఆదోని డీఎస్పీ హేమలతకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉందని, ట్రిపుల్ రైడ్, రాంగ్ వే కారణంగా సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కోఆర్డినేటర్ గోవిందు, మీడియా కో ఆర్డినేటర్ రాజశేఖర్, లీగల్ అడ్వయిజర్ మల్లికార్జున, సభ్యులు రమేష్, శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పనులు పూర్తయ్యేనా..?

- బిల్లులు రాక ఆగిన దౌల్తాపురం, నంచర్ల బీటీ రోడ్డు పనులు
- కంకర మీద వెళ్లడానికి ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- సకాలంలో పూర్తి చేయాలని కోరుతున్న ఇరు గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - చిప్పగిరి


బిల్లులు రాక బీటీ రోడ్డు పనులు ఆగిపోయాయి. పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని వాహనదారులు ఎదురుచూస్తున్నారు. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బీటీ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో చిప్పగిరి నుంచి దౌల్తాపురం, నంచర్ల మీదుగా మద్దికెర వరకు 12 కిలోమీటర్లు బీటీ రోడ్డు పనులకు రూ.10 కోట్లతో శ్రీకారం చుట్టారు. కంకర వేసేంత వరకే పనులు సాగాయని, అక్కడి నుంచి పనులు నిలిచిపోయినట్లు దౌల్తాపురం, నంచర్ల గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా చిప్పగిరికి రావాలంటే ఇరు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నంచర్ల గ్రామానికి చెందిన ప్రజలు దౌల్తాపురం మీదుగా చిప్పగిరి చేరుకోవడానికి కేవలం 8 కిలోమీటర్లు.. ఈ రహదారి బాగా లేకపోవడంతో నంచర్ల గ్రామం నుంచి కసాపురం, గుంతకల్లు మీదుగా చిప్పగిరికి చేరుకోవడానికి దాదాపు 30 కిలోమీటర్లు పడుతోంది. చిప్పగిరికి ఇంత ప్రయాసపడి వచ్చినా కొన్ని సందర్భాల్లో పనులు కాకపోవడంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. ఇప్పటివరకు దౌల్తాపురం గ్రామం దగ్గర వరకు రోడ్డు పనులు జరిగాయని, అక్కడి నుంచి నంచర్ల వరకు బీటీ రోడ్డు పనులు జరగకపోవడంతో ఈ పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు పనులు చేసినా బిల్లులు రాక అవస్థలు పడుతున్నట్లు, అందుకే పనులు నిలిపి వేసినట్లు కిందిస్థాయి అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం వారికి సకాలంలో బిల్లులు మంజూరు చేసి త్వరగా బీటీ రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలని చిప్పగిరి, దౌల్తాపురం, నంచర్ల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఆగిపోయిన దౌల్తాపురం, నంచర్ల బీటీ రోడ్డు పనులు

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

- గోవిందు, దౌల్తాపురం



చిప్పగిరి నుంచి దౌల్తాపురం, నంచర్ల గ్రామాల మీదుగా మద్దికెరకు వెళ్లే బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి. మా ఇరు గ్రామాల ప్రజలు పొలాలకు వెళ్లేందుకు, చిప్పగిరికి వెళ్లినప్పుడు ద్విచక్ర వాహనాలతో వెళ్లినా ఆ కంకర మీద ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సకాలంలో బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలి.


పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా దేవమ్మ, మారెమ్మ దేవర ఉత్సవాలు


ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని సూగూరు గ్రామంలో వెలసిన దేవమ్మ, మారెమ్మ దేవర ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవర సందర్భంగా మారెమ్మ, దేవమ్మ దేవాలయంలోని దేవత మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు కుంభాలతో ఆలయానికి చేరుకొని, నైవేద్యాలు సమర్పించారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలకరించారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి మారెమ్మ, దేవ మ్మను దర్శించుకొని పూజలు చేశారు. అంతకు ముందు గ్రామం చేరుకున్న ఆయనకు సర్పంచి లక్ష్మయ్య, దాస్, నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ సి.విశ్వనాథ్ రెడ్డి ఉన్నారు.

యూనిక్ ఐడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతులు తప్పనిసరిగా రైతు యూనిక్ ఐడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ సురేష్ బాబు సూచించారు. బుధవారం మండలంలోని పల్లెదొడ్డి రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో దాదాపు 23 వేల మంది రైతులు ఫార్మర్ యూనిక్ ఐడి కోసం ఫార్మర్ రిజిస్ట్రీలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని, రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పుస్తకం, మొబైల్ నెంబరు జిరాక్స్ కాపీలను తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.


రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎఒ

వారంలోనే చోరీ కేసు ఛేదన

- 47 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం
- నిందితుని మీడియా ముందు ఉంచిన డీఎస్పీ ఉపేంద్ర బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఇటీవల జరిగిన చోరీ కేసును వారం రోజుల్లో ఛేదించి, నిందుతుని అరెస్టు చేసి, బంగారు, వెండి ఆభరణాలు వస్తువులతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మాధవరంలో పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ ఉపేంద్ర బాబు మీడియా సమావేశం నిర్వహించారు. నిందితుని, స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు, నగదును మీడియా ముందు ఉంచారు. డీఎస్పీ వివరాల మేరకు... మండలంలోని మాధవరం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రచ్చుమర్రి గ్రామంలో జనవరి 25న తన ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మురారి శేషాద్రి శెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జనవరి 18న కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్ర వైపు తీర్థ యాత్రలకు వెళ్లగా అదే గ్రామానికి చెందిన యువకుడు దండు నాగేంద్ర.. మురారి శేషాద్రి శెట్టి ఇంట్లోకి దూరి బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులతో పాటు రూ.2.5 లక్షల నగదును దొంగలించాడు. తీర్థ యాత్రలు ముగించుకుని వచ్చిన శేషాద్రి శెట్టి ఇంట్లో దొంగలు పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన దొండు నాగేంద్ర చోరీకి పాల్పడినట్లు తేల్చారు. నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టగా మాధవరం, రాయచూరు రోడ్డులోని ఐరన్ బ్రిడ్జిపై ఉన్నాడనే సమాచారంతో దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 47 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి, రూ.2.5 లక్షల నగదు స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ రామాంజులు, ఎస్ఐ విజయ్ కుమార్, ఇతర సిబ్బందిని డీఎస్పీ ఉపేంద్ర బాబు ప్రశంసలు, రివార్డులతో అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ వీరేష్, గురుమూర్తి, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ వీరాంజనేయులు, వీరేష్, రఘు, సోమశేఖర్, రామకృష్ణ, హోంగార్డు వీరేష్ పాల్గొన్నారు.


నిందితుని చూపుతున్న డీఎస్పీ, పోలీసులు

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభలో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, మాజీ నాయకులు గోవింద్, సురేష్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను కార్పొరేట్, ప్రయివేట్‌కు అప్పగించి ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందని ప్రశ్నించారు. ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పత్రిక ప్రకటనలో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకోవడం తప్పితే విడుదల చేసిన పాపాన పోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో కలిసి రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులుగా రాము, కార్యదర్శిగా విజయ్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, 30 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు తిమ్మన్న, కెవిపిఎస్ నాయకులు ఆంథోని పాల్గొన్నారు.


జిల్లా కమిటీ నాయకులతో పట్టణ కమిటీ నాయకులు

ప్రభుత్వ పాఠశాలకు ఐడిబిఐ బ్యాంకు చేయూత

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని యాటకల్లు ప్రభుత్వ ఎంపిపి పాఠశాలకు ఐడిబిఐ చేయూత అందించింది. బుధవారం ఆదోని ఐడిబిఐ బ్యాంకు మేనేజర్ సోమన్న, గుంతకల్లు ఐడిబిఐ బ్యాంకు మేనేజర్ హరీష్ కుమార్ ఒక కంప్యూటర్, ఒక ప్రింటర్, ఒక బీరువా, ఒక టేబుల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు బ్యాంకు ముందుకొచ్చిందని తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి జీవిత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉరుకుంద బ్యాంకు అధికారులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. బ్యాంకు అధికారులు సుభాష్, రాకేష్, పాఠశాల కమిటీ ఛైర్మన్ సుదర్శన్, గ్రామ పెద్దలు విజయరంగా రెడ్డి, నాగరాజు, వీరా రెడ్డి పాల్గొన్నారు.



దాతలను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

ఆలయానికి ఎమ్మెల్యే విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

తెలంగాణా రాష్ట్రం ఐజ మండలంలోని ఉత్తనూరు గ్రామంలో వెలసిన శ్రీధన్వంతరి వెంకటేశ్వర స్వామి ఆలయానికి మంత్రాలయంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రూ.50 వేల విరాళం అందజేశారు. శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి ఉత్తనూరు గ్రామానికి చేరుకున్నారు. వారికి తిరుమల రెడ్డి కుమారుడు గౌతమ్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ముందుగా శ్రీధన్వంతరి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం రూ.50 వేల విరాళం అందజేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

'అమరావతి' విద్యార్థుల ప్రతిభ

ఆదోని : జిల్లాస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ అంతర్ పాఠశాలల పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని అమరావతి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ తెలిపారు. బుధవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆటపాటలతో పాటు చక్కని విద్యాభ్యాసం పాఠశాల ఉద్దేశమని తెలిపారు. ప్రైమరీ, హైస్కూల్ స్టూడెంట్స్ పాల్గొన్న ఈ పోటీల్లో 1వ తరగతి విద్యార్థి నిహాల్ శర్మ, 4వ తరగతి విద్యార్థి మనీషాకు మొదటి బహుమతి వచ్చిందని తెలిపారు. వేదిక్ మ్యాథ్స్‌లో 7వ తరగతి విద్యార్థి అభిరామ్‌కు మూడో బహుమతి, 9వ తరగతి విద్యార్థి జగన్ గౌడ్‌కు రెండో బహుమతి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అనాథ వృద్ధుడు మృతి

- అంత్యక్రియలు నిర్వహించిన స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో గుర్తు తెలియని అనాథ వృద్ధుడు మృతి చెందారు. బుధవారం మల్లెల గ్రూపు అధినేత డాక్టర్ మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ కామళే గణేష్, పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ యు.రాము, వ్యవస్థాపక అధ్యక్షులు సింగనేడు ప్రతిభ, భారతి, నరసన్న పట్టణ శివారులోని గోనెగండ్ల రోడ్డులో ఉన్న శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఉదయం ఒక వృద్ధుడు (60) అనారోగ్యంతో ఒపి తీసుకున్నారు. ఆయాసం ఎక్కువ కావడంతో ఆస్పత్రిలో మృతి చెందారని వైద్యులు గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి ఆధారాలు సేకరించడానికి పట్టణంలో ఉన్న పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆశ్రమానికి వెళ్లి వృద్ధుని సమాచారం అడిగి తెలుసుకున్నారు. పోలీసులు, పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కమిటీ సభ్యులు ఆదోని, తుంగభద్ర, మాధవరం, మంత్రాలయానికి సమాచారం అందించినా పూర్తి వివరాలు తెలియలేదని చట్టపరంగా అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, వెల్డర్ రాము, మల్లెల గ్రూప్ సభ్యులు బి.సతీష్ పాల్గొని అంత్యక్రియలు నిర్వహించారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న నాయకులు, పోలీసులు

'అడిగిన వారందరికీ ఉపాధి పనులు'


మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఆలూరు

అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ సయ్యద్ మహబూబ్ బాషా తెలిపారు. బుధవారం ఆలూరులోని ఉపాధి కార్యాలయంలో ఉపాధి హామీ చట్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వలసలను నివారించి కూలీలకు పనులు కల్పిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి కూలీల హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పని ప్రదేశంలో కొలతల ప్రకారం మస్టర్లు సక్రమంగా ఉండాలన్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎపిఒ శ్రీనివాసులు, ఈసీ మారన్న, టెక్నికల్ అసిస్టెంట్లు ఈరన్న, నాగేష్, రమేష్, గాదెప్ప పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ సమయంలో స్వల్ప మార్పులు

ప్రజాశక్తి - హొళగుంద

వ్యవసాయ రంగానికి 9 గంటలు అందిస్తున్న విద్యుత్ సమయాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు విద్యుత్ ఎఒ ఓబులమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడారు. హొళగుంద ఫీడర్‌కు ఉదయం 7.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, కోగిలతోట, నెరణికి ఫీడర్లకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అందించాలని ఆదేశాలు అందాయని తెలిపారు. రైతులు తమకు కేటాయిస్తున్న సమయంలో విద్యుత్‌ను వినియోగించుకొని సహకరించాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు.